నిఘా నేత్రాల నీడలో..!

- పల్లెల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు
- నేరాల నియంత్రణలో కీలకం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఇచ్ఛాపురం రూరల్:

నేరాల నియంత్రణ, భద్రతకు భరోసా పెంచేందుకు సీసీ కెమెరాలతో నిఘా ప్రస్తుతం అత్యంత ఆవశ్యకంగా మారిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా పట్టణాలతో పాటు పల్లెలకు కూడా సీసీ కెమెరాల ఏర్పాటు విధానం విస్తరిస్తోంది. ప్రముఖ ఆలయాలు, విద్యాసంస్థలు, బ్యాంక్‌లతో పాటు దుకాణాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసుకునే లా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఆస్తుల సంరక్షణ, భద్రత అంశాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన కూడా సీసీ కెమెరాల ఏర్పాటులో కీలకంగా మారిందని చెప్పవచ్చు.

ప్రజల భాగస్వామ్యంతో...

ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు దాతలు, గ్రామస్తుల సహకారంతో ఇప్పటివరకు మండలంలోని కొత్తారీ, ధర్మపురం, తులసిగాం, లొద్దపుట్టి, మశాఖపురం, బిర్లంగి, కొళిగాం, బాలకృష్ణాపురం గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.1.88 లక్షల ఖరీదు చేసే పాతిక కెమెరాలను రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కెమెరాలకు అనుసంధానంగా పోలీస్‌స్టేషన్‌లో మానిటర్ ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లోని దృశ్యాలు ఆ మానిటర్‌పై డిస్‌ప్లే అవుతుంటాయి. తద్వారా ఆయా గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు, చోరీలు జరిగితే వెంటనే అడ్డుకట్ట వేసేందుకు అవకాశం కలుగుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు తదితర సమయాల్లో పోలీసులు వేగవంతంగా పనిచేసేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

నిందితుల గుర్తింపు సులభం

ఇచ్ఛాపురం రూరల్ మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల్లో రికార్డైన పుటేజీని నెలరోజుల తర్వాత కూడా చూసుకునే వీలు ఉంది. దీంతో నేర పరిశోధన, నిందితుల గుర్తింపులో పోలీసుల పనితీరు మరింత సులభతరంగా మారుతోంది. సీసీ కెమెరా వ్యవస్థతో అసాంఘిక కార్యక్రమాలు, నేరాలు చాలా వరకు తగ్గుముఖం పడతాయని, వాటికి పాల్పడేవారికి సీసీ కెమెరాలు ఉన్నాయనే భయం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు



సమస్యాత్మక గ్రామం బాలకృష్ణాపురంలో సీసీ కెమెరాల ఏర్పాటు



మశాఖపురం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సహకరించాలి



ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాము. ఇప్పటికే స్థానిక ప్రజల భాగస్వామ్యంతో సమస్యాత్మక గ్రామాల్లో పాతిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలోని 21 పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి పూనుకున్నాం. వీటి ఏర్పాటుకు అందరూ సహకరించాలి. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుంది.

– ఈ.శ్రీనివాస్, ఎస్‌ఐ, ఇచ్ఛాపురం రూరల్



నిలిచిపోయిన భారీ వాహనం

కవిటి మండలంలోని కొజ్జిరియా సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలో గత రెండు రోజులుగా భారీ వాహనం నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెన్నై నుంచి పారాదీప్‌కు వెళ్తున్న ఈ లారీ టోల్‌ప్లాజాకు చేరుకునేసరికి దాని గుండా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో, ద్విచక్ర వాహనాలు వెళ్లేమార్గంలో టోల్‌గేట్ దాటించేందుకు ప్రయత్నించారు. కానీ ఆ రూటులో వెళ్లినప్పుడు రోడ్డు కుంగిపోయి వాహనం దిగబడిపోయింది. ఈ లారీ సరిగ్గా రహదారి మధ్యలో ఆగిపోవడంతో అవస్థలు తప్పడం లేదు. అందువలన ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– కవిటి



సమాచారం ఎక్కడ.?

సామాన్యుడు ఏ ఆఫీసుకు వెళ్లినా పనిచేయించుకోవడం, తనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కోసం 2005 అక్టోబర్‌లో సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. అయితే దీనిలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక బోర్డుల్లో ఉండాల్సిన వివరాలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కనిపించడం లేదు. దీంతో గ్రామ, మండల పరిషత్‌కు సంబంధించి సమాచారాన్ని రాబట్టేందుకు ఎవరిని సంప్రదించాలో తమకు అర్థం కావడం లేదని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని నేషనల్ యూత్ వాలంటీర్ హంగీర్ బెహరా అన్నారు. మండలంలోని ఈదుపురం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌లాండ్ ఫిషరీస్ మాజీ అధ్యక్షుడు గయా రామచంద్ర బెహరా, చంద్ర బెహరా, ఉమాకాంత్, జీతు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎంఎస్‌ఎంఈ సర్వే



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఎంఎస్‌ఎంఈ సర్వేను పక్కాగా పూర్తి చేయాలని కమిషనర్ నడిపేన రామారావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైజర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. బకాయిలు ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లు త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని మార్చి 1వ తేదీ నుంచి ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న రైలు యూజర్ కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పూరీ – అహ్మదాబాద్, అమృత్‌సర్ – హిరాఖుడ్, పూరీ – యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఖుర్దా డివిజన్ డీఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్యప్రకాష్, స్థానిక రైలు యూజర్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్టు రైల్వే ఖుర్దా డివిజన్ అధికారులు ఈస్ట్‌కోస్టు జోనల్ ఆపరేటింగ్ మేనేజర్ వైఎస్ బాబు, చీఫ్ అడ్మినిస్టేటివ్ అధికారి జీహెచ్ విక్టర్ జోషఫ్, డీసీఎం అనిల్‌కుమార్, డివిజనల్ ఇం/ నీర్ అభిషేక్ కుమార్‌లను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైల్ యూజర్ కమిటీ అధ్యక్షుడు డి.గోపాలరావు, ప్రతినిధులు వి.రాజు, పి.జనార్దన్‌రావు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు పరిశ్రమతో ఆర్థిక స్వావలంబన



మహిళా రైతులతో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం రమేష్‌కృష్ణ

వజ్రపుకొత్తూరు: ఉద్దానంలో కొబ్బరి పీచు పరిశ్రమ నెలకొల్పడం ద్వారా మహిళలు ఆర్థిక స్వాలవలంబన సాధించగలరని నాబార్డు డీడీఎం కె.రమేష్‌కృష్ణ అన్నారు. మండలంలోని రెయ్యిపాడులో హ్యూమన్ డవలప్‌మెంట్ స్టూడెండ్ అసోసియేషన్ (హెచ్‌డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంగపుత్ర వెజిటబుల్ ప్రొడ్యూసర్స్ కంపెనీని గురువారం ఆయన సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కంబాలరాయుడుపేటలో ఇదివరకే ఏర్పడిన కొబ్బరి పీచు ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలంతా పెద్ద గ్రూపుగా ఏర్పడి పీచు పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికోసం ఎఫ్‌పీవో నుంచి ఎక్కువ మొత్తంలో లోన్ పొందడమే కాకుండా పీఎంఈజీపీ పథకాలను పొందవచ్చునన్నారు. ఉద్దానం ప్రాంతంలో మునగ పంట ఎక్కువగా ఉన్నందున, విలువైన ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తే ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చక్కటి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్‌ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వెంకటరమణ, బ్యాంక్ ఎఫ్‌ఏ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న బారువ కొత్తూరు గ్రామస్తులు

సోంపేట: మండలంలోని బారువ కొత్తూరు గ్రామంలో మంగళవారం ఉరి వేసుకుని మృతి చెందిన యువతి వలిశెట్టి తులసి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరారు. ఈ మేరకు బారువ పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. తులసి మృతికి బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రదీప్ కారణమని పేర్కొన్నారు. ప్రదీప్ వేధింపుల వలనే తులసి మృతి చెందిందని పోలీసుస్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేసినా, నేటికీ ప్రదీప్‌ను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ప్రదీప్‌ను అరెస్టు చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ బి.మంగరాజు మాట్లాడుతూ త్వరితగతిన కేసు దర్యాప్తు చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. ఆందోళనలో గ్రామస్తులు రాజు, లోకనాథం, కుమార్, తులసి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళలను పరిరక్షించుకోవాలి



రేజేటి బోసుబాబును సన్మానిస్తున్న దృశ్యం

పలాస: ప్రజా కళలను పరిరక్షించుకోవాలని జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు, సినీ నటుడు డాక్టర్ కుమార్‌నాయక్ కోరారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జన జాగృతి సంస్థ నవ వసంతాల ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగ స్థల నటుడు రేజేటి బోసుబాబుకు నట కిరీటి బిరుదును ఇచ్చి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం 14 మంది అంధ కళాకారులచే స్వర రంజనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 36 మంది జానపద పౌరాణిక కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బండారు కాళిదాసు, గౌరవ అధ్యక్షుడు ఎల్.వి.చలం, తమ్మినేని మాధవరావు, శ్రీనివాసబాబ్జి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం నేడు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ నడిపేన రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా తీర్మానం తీసుకురానున్నారని సమాచారం. చైర్మన్ బి.గిరిబాబు నేతృత్వంలో జరిగే సమావేశంలో సభ్యులు పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



కంచిలి: పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న సెక్టోరియల్ ఆఫీసర్ జగన్మోహనరావు



ఇచ్ఛాపురం/టౌన్: హెల్ప్‌డెస్క్‌ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు



సోంపేట: ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఉపాధ్యాయుడు చెంగల్వరావు




వజ్రపుకొత్తూరు రూరల్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్



సంతబొమ్మాళి: ఎన్నికల శిబిరంలో కోలాహలం



నందిగాం: సిబ్బందికి సూచనలిస్తున్న పలాస ఆర్డీవో వెంకటేష్



కవిటి: పోలింగ్ పరిశీలిస్తున్న ఎస్‌ఐ రవివర్మ, సిబ్బంది

సోంపేట: మండల కేంద్రంలోని 12వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 176 మంది ఓటర్లకు గానూ, 172 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు.

టెక్కలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డివిజన్ కేంద్రమైన టెక్కలిలో మొత్తం 254 ఓట్లుకు 240 ఓట్లు పోలయ్యాయి. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పలు మండలాల్లో పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో సీఐ విజయకుమార్, కె.శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టెక్కలి డివిజన్ పరిధిలో పోలింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను టెక్కలి ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. ఇక్కడ నుంచి ఆర్డీవో పర్యవేక్షణలో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీకి తీసుకెళ్లారు.

సంతబొమ్మాళి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండలంలో 98 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 52 మంది ఓటర్లు ఉండగా, 51 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలో మొత్తం 78 ఓట్లకు గానూ, 76 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను ఆర్డీవో జి.వెంకటేష్ పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సీతారామయ్య, ఎస్‌ఐ నీహర్, ఎంపీడీవో రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

కంచిలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 89 ఓట్లకు 83 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ప్రక్రియను సెక్టోరియల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన వ్యవసాయశాఖ ఏడీ పి.జగన్మోహనరావు పరిశీలించారు. తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. ఆయనకు ఎంపీడీవో వి.తిరుమలరావు తదితరులు సహకరించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు బందోబస్తు నిర్వహించారు.

ఇచ్ఛాపురం/టౌన్: ఇచ్ఛాపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం 111 మంది ఓటర్లకు గానూ, 104 మంది వారి ఓటుహక్కుని వినియోగించుకున్నారు.

కవిటి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 93 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

కాశీబుగ్గ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పలాస మండల కేంద్రంలో 280 ఓట్లకు గానూ, 262 ఓట్లు పోలయ్యాయి. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించారు.

నందిగాం: స్థానిక ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 98 ఓట్లకు గానూ, 94 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పలాస ఆర్డీవో జి.వెంకటేష్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.



టెక్కలి: బ్యాలెట్ బాక్సుల తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి




కాశీబుగ్గ: పలాసలో ఎన్నికల కేంద్రం వద్ద మద్దతుదారులు

పెరిగిన మల్లన్న ఆదాయం

టెక్కలి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదాయం పెరిగింది. ఒక్క రోజులో రూ.9,23,332ల ఆదాయం వచ్చినట్లు ఈఓ జి.గురునాథ రావు వెల్లడించారు. గురువారం దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. శీర్షాభిషేకం ద్వారా రూ. 2.94 లక్షలు, శీఘ్ర దర్శనం ద్వారా రూ.1,96,820, కేశ ఖండన ద్వారా రూ.12 వేలు, తాత్కాలిక, శాశ్వత హుండీల ద్వారా రూ.4,20,512లు ఆదాయం వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2,54,752 ఆదాయం పెరిగినట్లు వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఈఓ మనస్వితో పాటు మాజీ చైర్మన్ ఎల్.ఎల్.నాయుడు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో గోపిబాల

కంచిలి: పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని డీఎల్‌పీవో ఆర్.గోపిబాల సూచించారు. మండలంలోని కంచిలి పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో స్థానిక ఎంపీడీవో వి.తిరుమలరావు, కార్యాలయ సూపరింటెండెంట్ హెచ్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రహదారి విస్తరించాలి



గతంలో మాలపేట వరకు రహదారి కోసం మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నందిగాం: మండలంలోని జాతీయ రహదారి నుంచి చిన్న తామరాపల్లి వరకు నిర్మాణం చేస్తున్న బీటీ రహదారిని మాలపేట వరకు విస్తరించాలని కర్లపూడి సర్పంచ్ తమిరె రాజు, పట్నాన రామారావు, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, భాస్కరరావు, బెలమర రామారావు తదితరులు డిమాండ్ చేస్తున్నారు. 2018లో మంజూరైన ఈ రహదారిని జాతీయ రహదారి నుంచి దళిత గ్రామమైన మాలపేట వరకు వయా బెజ్జిపల్లి, పోతులూరు, చిన్న తామరాపల్లి మీదుగా రూ.2.55 కోట్ల అంచనా వ్యయంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అయితే రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో మరలా ఇదే రహదారిని ఇప్పుడు జాతీయ రహదారి నుంచి చిన్న తామరాపల్లి వరకు రూ.1.96 కోట్లతో మంజూరు చేశారన్నారు. అయితే రహదారిని చిన్నతామరాపల్లి వరకు మంజూరు చేసి, పూర్తి దళిత గ్రామమైన మాలపేటను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని గమనించి రహదారిని మాలపేట వరకు నిర్మాణం చేపట్టాలని కోరారు.